# పొదరిల్లు

సొంత యిల్లు అన్నది నా జీవితానికో కల.

నాతండ్రి ఎడ్యుకేషనల్ డిపార్ట్‌మెంట్లో యి.వో.గా పనిచేసేవాడు. అతడికి తన తండ్రి నుండి సంక్రమించిన గాంధేయవాదం, నిజాయితీ పాళ్ళు ఎక్కువగా వుండేవి. దాంతో అటునుంచి ఇటు, ఇటునుంచి అటు ఎక్కువ భాగం బదిలీల్లోనే గడపాల్సొచ్చేది.

ఒక వూరిలో దిగి ఆయింటికి ఆ వాతావరణానికీ, ఆ వూళ్ళోని మనుషులకీ అలవాటు పడేలోపుగా మరోవూరికి విసిరి వేయబడే వాళ్ళం. రెకమెండేషన్స్‌తో బదిలీల్ని ఆపుకోవడం నా తండ్రి సిద్ధాంతానికి విరుద్ధం. దాంతో ఒక వూళ్ళో స్థిరంగా లేకపోవడంతో సొంత యిల్లు, కనీసం అద్దె యిల్లయినా సరె యిది నాది అనుకునే అవకాశమే లేకుండా పోయింది.

పెళ్ళయింది... అతడు బ్యాంకాఫీసరు. మళ్ళీ షటిల్ షరా మామూలే... ఈ వూరి నుండి ఆవూరికి, ఆవూరి నుండి మరో వూరికి... యిలా వూళ్ళు తిరగడంతోనే జీవితమంతా

జరిగిపోయింది. జీవితమెప్పుడూ అంతే... మనం ఒకవైపు నుండి దాన్ని బంధించాలని చూస్తుంటాం. మరోవైపు నుండి మెల్లగా అది జారిపోతూ వుంటుంది. అయితే అది ఒక్కొక్కప్పుడు అనుకోని మలుపులు కూడా తిరుగుతూంటుంది.

కుమార్‌కి ఏ పురుగు తొలిచిందో తెలీదుగానీ సడన్‌గా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని యిదిగో ఈ వూళ్ళో రొయ్యల గుంటలు మొదలుపెట్టాడు. ముందు ఉద్యోగం అర్ధాంతరంగా వొదిలేసినందుకు చిరాకన్పించినా క్రమంగా కుమార్ తీసుకున్న నిర్ణయం సరయిందేనని తెలిసొచ్చింది. రొయ్యలు చంటి బిడ్డల్లాంటివి... మన పసిబిడ్డల్ని అయినా ఓ గంట నిర్లక్ష్యం చేయొచ్చుగానీ, రొయ్య పిల్లల్ని మాత్రం దగ్గరుండి చూసుకోవాల్సిందే. ఇందులో పోతే అంతా వూడ్చి పెట్టుకుపోతుంది. వస్తే అమితంగా పొర్లుకొస్తుంది అని అంతా అన్నట్లుగానే తొలిసారే మంచిలాభాలొచ్చి పడ్డాయి. కొంత డబ్బుతో మరో రెండు పాండ్స్ స్టార్ట్ చేసి మిగిలిన డబ్బుతో యిల్లు మొదలుపెట్టాడు కుమార్. నేను చిన్నపిల్లలా ఎగిరి గంతేశాను. దగ్గరుండి నాకు నచ్చిన రీతిలో, మరీ పెద్దవి కాకుండా, మరీ చిన్నదీ కాక కంపాక్ట్‌గా మూడు పడగ్గదులొచ్చేలా అందమైన యిల్లు కట్టించుకున్నాను.

కింద వరండా, పెద్దహాలూ, కిచెన్, డైనింగ్‌రూమ్, ఒక బెడ్రూమూ వచ్చాయి. హాల్లో ఒక మూలగా వున్న మెట్లెక్కి పైకి వెళ్తే చిన్న సిటిన్, రెండు బెడ్రూములూ... అన్ని బెడ్‌రూమ్‌లకి అటాచ్‌డ్ బాత్‌రూమ్స్, వాటికి గ్లేజ్‌డ్ టైల్సూ, గోడలకి పింగాణీ అద్దాలూ, అదే కలరు వాష్ బేసిన్సూ అంతా నేను కోరుకున్న రంగుల్లోనే తయారయ్యాయి.

నా నిజాయితీపరుడయిన తండ్రి మూలంగా జీవితం రెండు కొసలూ కలపడమే కొంత కష్టంగా వుండేది. ఇక ఇటువంటి కోరికలు తీర్చుకోవడమనేది కలలో మాట. కుమార్ని నేను ప్రేమించి పెళ్ళి చేసుకుని మంచిపనే చేశాను. మితిమించిన నిజాయితీతో నాప్రాణం తీయడు. అతడికి జీవితావసరాలు తెలుసు. భార్యాబిడ్డల్ని సుఖపెట్టడం తెలుసు అందుకే నా కల నిజమయింది.

మరి యింత బాగా యిల్లు కట్టించుకుని నలుగురిని పిలిచి గృహప్రవేశం చేయకపోతే ఎలా? అందరినీ ఆహ్వానించడాలూ, ముఖ్యమయిన వాళ్ళందరికీ బట్టలు కొనడం... యిదంతా తడిసి మోపెడయింది. అనుకున్నట్లుగానే గ్రాండ్‌గా గృహప్రవేశం జరిగిపోయింది. పిల్లలిద్దరూ కోచింగ్ సెంటర్ల నుండి యింటికి పిలిపించబడ్డారు.

మేడమీద తమకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన పడగ్గదులను చూసుకుని విక్రమ్, వినుత యిద్దరూ కూడా చాలా ఆనందపడిపోయారు. మేమింతకాలంగా బదిలీలతో గడుపుతూండడంతో పిల్లలు చిన్నప్పట్నుండీ హాస్టళ్ళలోనే వుండిపోవాల్సి వచ్చింది. ఇప్పుడిలా యింట్లోనే వుండి చదువుకోవచ్చునన్న ఆలోచన బహుశా వాళ్ళకంత ఆనందాన్ని కలిగించి వుండొచ్చు. నాక్కూడ పిల్లలిలా కంటికెదురుగా వుండడం బావుంది.

రెండోసారి రొయ్యల గుంటలు క్లియర్ చేసినపుడు యింటికి సోఫాసెట్టు, డబుల్‌డోర్ ఫ్రిడ్జ్, మూడు బెడ్‌రూముల్లోకి మూడు టి.వి.లూ వచ్చి చేరాయి.

ఇంకా యింటి గోడలకి మంచి మంచి వాల్ పోస్టర్సూ, యింటి నిండా ప్రతి మూలా అందమైన ఫ్లవర్ వాజులూ, జీవమున్న మొక్కలూ, షోకేసుల్నిండా కొత్త కొత్త బొమ్మలు, నగిషీలు చెక్కబడ్డ పెద్ద డైనింగ్ టేబుల్ ప్రక్కనున్న షోకేసులో అందమైన వెలగలిగిన క్రోకరీ.

ఆరు బయట ఎక్కడెక్కడి నుండో కొని తీసుకురాబడ్డ క్రోటన్సూ, గులాబీలూ, మందారాలూ... ఇవన్నీ మొత్తం సేకరించి ఎక్కడివక్కడ అమర్చేసరికి సంవత్సరకాలం నాకు తెలీకుండానే జరిగిపోయింది. అప్పటికి యింటికి మొత్తం నేను కోరుకున్న ఒక షేప్ వచ్చింది. తోటలో లవ్ బర్డ్సూ, యింట్లో గ్లాసు కేసుల్లో రంగు రంగుల చేప పిల్లలూ, ఈ యింటినంతటినీ కాపలా కాయడం కోసం ఒక జర్మన్ షెపర్డూ అదనంగా మాతో కలిశాయి. జర్మన్ షెపర్డ్‌డాగ్‌కి ప్రతిరోజూ మాంసం కొంటున్నప్పుడల్లా నా తండ్రి పదేపదే జ్ఞప్తి కొచ్చేవాడు...

'ఈగొప్పవాళ్ళంతా తమ తమ సొంత ఆస్థుల్ని కాపాడుకోవడం కోసం పెట్టుకున్న కుక్కల గురించి ఖర్చు చేసేదాంట్లో సగమయినా పేదజనాల కోసం ఖర్చు పెట్టరు... చివరికి వెళ్ళేటప్పుడిదంతా తమతోనే కట్టుకు పోతారని భావిస్తారు' అంటూండేవాడు. అతడి రక్తమూ, అతడి వాసనలూ యింకా నాలో మిగిలి వున్నందుకు ఒక్కొక్కసారి విసుగ్గా వుంటుంది.

నా యిల్లూ, నా కుటుంబమూ, నా పిల్లలూ ఏర్పడ్డాక ఈ పాత ఆలోచనలన్నింటినీ కట్టకట్టి ఏట్లోకి విసరాలి.

పిల్లలిద్దరూ ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఎంట్రన్స్ ఎగ్జామ్స్ వ్రాసి, యిద్దరికీ సీటు రాకపోవడంతో యిదే వూళ్ళో డిగ్రీ కాలేజీలో చేరారు. యిద్దరూ పక్కనే కంప్యూటర్ కోర్సులు కూడ చేస్తున్నారు. వాళ్ళ చదువులేమొ, వాళ్ళేమొ గదిని వదిలి బయటకి రారు.

* * *

"మమ్మీ కాఫీ కావాలి..." పైన సిటిన్‌కొచ్చి కేక పెట్టి మళ్ళీ లోపలి కెళ్ళిపోయింది వినుత.

నేను వంటావిడ్ని పిలిచి కాఫీ కలిపి తీసికెళ్ళమని చెప్పాను. చాలా కాలం తరువాత వచ్చిన నా స్నేహితురాలు సునీతతో నేను కబుర్లలో వున్నాను... సునీత, నేను ప్రాణ స్నేహితులం. బాల్యం నుండే సునీత నాకు పరిచయం. సునీత నా జీవితానికో దిక్సూచి వంటింది. అనేకానేక సమయాల్లో, కష్టాల్లోనూ, సుఖాల్లోనూ నాకు సరయిన సలహాలనిచ్చి స్నేహాన్నీ, ప్రేమనీ, ఆప్యాయతనీ కూడ పంచింది. ఎన్నేళ్ళు గడిచిపోయినా మా స్నేహం పాతబడలేదు.

"సునీ... ఏంటే అట్లా చూస్తున్నావు?" ఉలిక్కిపడింది సునీత.

నాతో ఏదో చెప్పాలని నోరు తెరచి వంటావిడ కాఫీ తీసుకురావడంతో ఆగిపోయింది... సుబ్బమ్మ మా యిద్దరికీ కాఫీ అందించి, వినుత కోసం ఒక కప్పు పట్టుకుని పైకెళ్ళింది.

సుబ్బమ్మ మెట్లెక్కంత వరకూ కాఫీ చప్పరిస్తూ వుండిపోయాన్నేను. సునీత సాలోచనగా టి.వి. వంక చూస్తూ వరుసగా ఛానెల్స్ మారుస్తోంది. కాఫీ తాగుతున్నట్లుగా నటించి తిరిగి కప్పుని టీపాయి మీద పెట్టింది.

"సునీ" పిలిచాన్నేను మళ్ళీ.

సునీత చప్పున పైకిలేస్తూ "రా తోటలోకి వెళ్దాం" అంది. నేను మాట్లాడకుండా లేచి సునీతను అనుసరించాను.

ఇద్దరం మొక్కల నడుమ నడుస్తూండగా అంది సునీత "ఇల్లు చాలా బావుంది పుష్పా"

ఉదయం నుండీ సునీత ఆమాట అనలేదేవిటా అని ఆతృతగా ఎదురు చూస్తున్నాన్నేను. ఇంతసేపటికి సునీత నోటి నుండి ఆ మాట రావడంతో సంతోషమన్పించింది.

"ఇంట్లో ఫర్నిచర్ కూడా బాగా అమర్చావు... మూలమూలా ఫ్లవర్‌వాజ్‌లూ, అవసరమైనంత మేరా ఎలక్ట్రానిక్ గూడ్స్, ఎక్కడా యింత దుమ్ము కూడ లేకుండా ఎంచక్కా మెయిన్‌టెయిన్ చేస్తున్నావు. హేట్సాఫ్"

"థాంక్యూ... థాంక్యూ వెరీమచ్" నా ఆనందం హద్దులు దాటింది. "కానీ పుష్పా మనిషి జీవించడానికి యింత యిల్లు అవసరమంటావా?"

నా ముఖం నల్లగా మాడిపోయింది.

"అంటే... మనుషులు యిల్లు కట్టుకోవడం తప్పంటావా?" కొంత నిష్టురం ధ్వనించింది నా గొంతులో.

"తప్పుకాదు.. మనిషికి బతకడానికే కాకపోయినా కనీసం ఛావడానికయినా ఒక కప్పుండాల్సిందే... అయితే యింత పెద్దదిగా, యింత ఆడంబరంగా యిన్ని సౌకర్యాలతో అంత అవసరమంటావా? ఇల్లు బావుంది. పేరు కూడా బాగానే పెట్టావు. 'ప్రశాంతి నిలయం'... కానీ పుష్పా నువ్వు మనశ్శాంతితో వున్నావా లేదా తెలీడం లేదు... నీకీ యింట్లో నిద్ర పడ్తోందా?"

సునీత హఠాత్తుగా యిలా అనడంతో ఆశ్చర్యపోయాను. నిజమే యింటికి అనుకున్న దానికంటే ఎక్కువే అయింది.

ఆ తర్వాత ఫర్నిచరు అంతా తడిసి మోపెడయింది. అప్పు తీసుకురాక తప్పలేదు... మూడోసారి క్రాప్ తుడిచిపెట్టుకు పోవడంతో ఆ అప్పు తీర్చలేక అదంతా కలిసి వడ్డీలతో పెరిగి పెరిగి పిల్లలు పెడుతోంది.

దాంతో నేనూ, కుమార్ కొంత డిస్టర్బ్‌డ్‌గా వున్నాం. అయితే కుమార్ మీద నాకు నమ్మకముంది. చాలా పట్టుదల గల మనిషి. ఇదంతా తప్పక క్లియర్ చేయలడు.

"ఏంటి పుష్పా మాట్లాడవ్" రెట్టించించి సునీత.

"అదేం? అట్లా అని కాదు నువ్వు హాయిగా వున్నావు కదా"

"ఊ" అన్నాను అవునూ, కాదూ అన్న విషయాన్ని తేల్చకుండా.

"ఏమో బాబూ నాకు మాత్రం ఏదో తేడా కన్పిస్తోంది. నీకు గుర్తుందా. విద్యానగర్లో మీరున్నపుడు నేను వస్తే నువ్వు, కుమార్ స్కూటర్ మీదొచ్చారు నన్ను రిసీవ్ చేసుకోవడానికి. వచ్చేప్పుడు మనిద్దరం రిక్షాలో వస్తూ ఎన్నెన్ని కబుర్లు కలబోసుకునే వాళ్ళం. ఈరోజు స్టేషన్‌కి డ్రైవర్తో కారు పంపించావు.. అతనెవరో వెదుక్కోవటానికి పదిహేన్నిముషాలు పట్టింది నాకు. సరే నేనొచ్చేప్పటికే కుమార్లేడు. ఇదివరకయితే నేను రాగానే పిల్లలు, కుమార్ ఎంతగా ఆనందించేవారు... అందరం కూర్చుని కబుర్లు చెప్తుంటే నువ్వు వంట చేస్తుండేదానివి. నీచేతి కాఫీ ఒకసారి రుచి చూసిన వాళ్ళు మళ్ళీ ఈ జన్మలో మర్చిపోగలరా చెప్పు"

గిల్టీ ఫీలింగ్‌తో నా హృదయం కదిలిపోయింది. నిజమే సునీతకి నేను చేసే కాఫీ అంటే చాలా యిష్టం. దానికి ఉదయం నుండీ వంటావిడ చేతి కాఫీయే గతయింది.

నిజమే గతంలో నేనే వూళ్ళో వున్నా సునీత నన్ను విజిట్ చేసేది. దానికి వూళ్ళు తిరగాలంటే చెప్పలేనంత యిష్టం. వాళ్ళాయన వ్యాపారంతో మద్రాసు నుండి కదలాలంటే కుదరదు. అందుకని నేనెక్కడున్నా సరే వచ్చేసేది. పిల్లలు సునీతంటే చాలా యిష్టపడేవారు. అటువంటిది పిల్లలు ఉదయం సునీతకి జస్ట్ 'హలో' చెప్పి వెళ్ళిపోవడం తప్ప సునీతతో అసలేమీ మాట్లాడలేదనుకుంటే యిప్పుడు ఆశ్చర్యంగా వుంది.

పిల్లలు హోటల్ గదుల్లో రెసిడెంట్స్ లాగ భోజనం వేళకి వచ్చి భోజనం చేసి వెళ్ళిపోవడం... ఇది వరకయితే కనీసం టి.వి. గురించయినా హాల్లో కూర్చునేవాళ్ళు. ఫోన్ కోసమయినా కిందికి దిగొచ్చేవాళ్ళు. ఇప్పుడు ఎవరి గదుల్లో వాళ్ళకి టి.వి.లూ, పి.సి.లూ, సెల్ ఫోన్లూనూ.

గతంలో అయితే?

"మమ్మీ నీకు ఫోన్"

"మమ్మీ ప్లీజ్ క్రికెట్ పెట్టుకుంటాను... సీరియల్లో ఏముంది?"

ఇంట్లో వున్నంతసేపూ మమ్మీ మమ్మీ అంటూ నా చుట్టూ తిరిగేవాళ్ళు. ఇప్పుడా గదుల్లో ఎవరేం చేస్తున్నారో. యింత పెద్ద యింట్లో ఎవరే మూల వుంటున్నారో అర్థంకాదు. అర్థరాత్రి నేను నిద్రలో కదిలితే పక్కనే వుండి మెల్లిగా జోకొట్టే నా తండ్రి గుర్తొచ్చాడు. అమ్మా, నాన్న, నేను, అన్నయ్య అంతా ఒకే గదిలో నివసించేవాళ్ళం. అప్పుడా గది చాలా యిరుగ్గా అన్పించేది. ఇప్పుడాలోచిస్తే అర్థమవుతోంది. గది యిరుకే గానీ మనసులు చాలా పెద్దవి. నా యింట్లో జరిగిన ఈ మొత్తం మార్పుని సునీత వచ్చి చెప్పేదాకా నేను సమీక్షించు కోలేక పోవడం నిజంగా శోచనీయం.

ఆ రాత్రి మాస్టర్ బెడ్‌రూమ్‌లోని నా స్ప్రింగ్‌కాట్ మీద పడుకుని ఆలోచనలో పడ్డాన్నేను. కుమార్ డ్రింక్ తీసుకుంటూ టి.వి. చూస్తున్నాడు. నేనతడ్నే నిశితంగా గమనిస్తున్నాను.

గతంలో బ్యాంకాఫీసరుగా వున్నపుడు సాయంత్రమయితే చాలు నేరుగా యింటి కొచ్చేసేవాడు. వస్తూ వస్తూ మల్లెపూలు తీసుకొచ్చేవాడు. ఎంత ఒత్తిడిలోనయినా సరే నాతో కలిసి గడపడంలోనే రిలాక్సేషను వుందనేవాడు. అతడితో గడిపిన ఆనందమయమైన సాయంత్రాలూ, సుఖమైన రాత్రులూ జ్ఞప్తికి వచ్చి ఒక్క క్షణం నా మనసు మత్తుగా మూలిగింది.

వెంటనే చెప్పలేనంత దిగులు నన్నావరించింది. ఇప్పుడు డబ్బుతో వచ్చిన టెన్షన్‌ని తట్టుకోవడానికి డ్రింకూ, టి.వి.ల్లో రిలాక్సేషన్ దొరుకుతోందతడికి.

నా ఉనికిని గుర్తించి కుమార్ ఎప్పుడు నా దగ్గరికొస్తాడా అని యిష్టంగానూ, అసహనం గానూ ఎదురు చూస్తున్నాన్నేను. స్ప్రింగ్‌కాట్లోని డన్‌లప్ బెడ్‌లో నుండి ఏవో సనసన్నటి ముళ్ళు నా వీపుని గుచ్చుతున్నాయి.

గ్రంథాలయ సర్వస్వం, నవంబరు 2000